126

# వెదురుతో వేయి రకాలు

ఏభయ్యేళ్ళ క్రిందట సీతయ్య వయస్సు ఇరవయ్యేళ్ళు. ఈ మధ్య కాలంలో సీతయ్య చాలా మార్పులు చూశాడు. రెండు ప్రపంచ యుద్ధాలు చూశాడు.మొదటి ప్రపంచ యుద్ధం గురించి సీతయ్య సరిగా చెప్పలేకపోయాడు,.. కానీ రెండో యుద్ధం గురించి చాలా చెప్పాడు. ఆయన తమ్ముడు కిష్టయ్య రెండో ప్రపంచ యుద్ధమప్పుడు సిపాయిగా చేరాడు. మూడు సంవత్సరాలపాటు కిష్టయ్య, అక్కడా ఇక్కడా తిరిగాడు. ఆఖరుకు బర్మాలో చనిపోయాడు. చనిపోయేనాటికి కిష్టయ్యకు ఇరవయ్ నాలుగేళ్ళుండేవిట. అతగాడు మిలిటరీలో చేరకపోతే వాణ్ని తన పనిలోనే ఉంచుకునేవాణ్నన్నాడు సీతయ్య.

" ఆ రోజులే వేరు. ఆ జనమే వేరు. గుంటూరు పోవాలంటే రెండామడ దూరమూ చచ్చినట్టు నడిచేవాణ్ని, పాతిక రూపాయలు పెడితే బండెడు బొంగులొచ్చేవి. ఆర్నెల్లదాకా చేతినిండాపని. కడుపునిండా తిండి. ఇప్పుడేమున్నదండీ నా పాడె! నా పచ్చి బద్ధలూ!" అన్నాడు సీతయ్య తిరుచూర్ణం తీర్చిదిద్దుకుంటూ.

ఆ రోజుల్లో సీతయ్య ఇంటి చుట్టూరా బొంగులే వుండేవి. "బండి జల్లలు, గుమ్మెలు, కంకులెత్తే గంపలు నేను చేసినట్టు చేసేవాళ్ళు తక్కువండీ. మందపాటి బద్దతో బండి జల్ల అల్లానంటే రెండు తరాలు చూసేది. ఇక ఇళ్ళ సీజను వొచ్చిందంటే బువ్వతినే తీరుబాటు కూడా ఉండేది కాదు. వడ్రపయ్య బొంగులు బిగించి పోయేవాడు. నేను నా బామ్మరిది తడిక అల్లేవాళ్ళం. అప్పుడు నేనల్లిన ఇళ్ళు ఇంకా రాళ్ళలలాగా ఉన్నయ్. ఇప్పుడేముందండీ నా పాడె. నా పచ్చిబద్దలూ" అన్నాడు సీతయ్య. బొట్టుకడ్డీని తిరుచూర్ణం సీసాలో వేసి, దాన్ని వొంకెకు తగిలించి "వీడు మా పెద్దాడండి. ముగ్గురాడపిల్లల తరువాత పుట్టాడు. వాళ్ళమ్మ వెంకటేశ్వరస్వామికి మొక్కుకొంది. అందుకనే తిరుపతయ్యాని పేరుపెట్టాం" అన్నాడు సీతయ్య. లోపల్నుంచి గిన్నెల చప్పుడయ్యింది. డేక్కుంటూ లోపలికెళ్ళాడు సీతయ్య. అంత దాకా నిశ్శబ్ధంగా బుట్టలల్లుకొంటున్న తిరుపతయ్య, తండ్రి అటుపోగానే బీడి ముట్టించాడు. గుప్పుమని పొగవదలి చెప్పడం ప్రారంభించాడు, "మా నాన్నదంతా పరమ ఛాదస్తమండీ! చెప్పిందే చెప్పిందే మళ్ళా మళ్ళా చెప్పి ప్రాణాలు తీస్తాడు బాబయ్యగారూ! ఆయనకు మతి చలించిందండీ. ఆ మాట మేమంటే భగ్గుమని మండిపడతారు. నాకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. అయినా నేనింకా చిన్న పిల్లాణ్ననుకొని మీదిమీదికొస్తాడు కొట్టబోతాడు, నరుకుతా నంటాడు. చీలుస్తా నంటాడు. ఈయన్తో చచ్చినచావుగా ఉందండీ" అని విసుక్కున్నాడు తిరుపతయ్య.

తరువాత మెల్లిగా అసలు విషయంలోకి వచ్చాడు. పూర్వానికీ ఇప్పటికీ సంబంధం లేదన్నాడు. ఆ రోజుల్లో పాతిక రూపాయలిస్తే బండెడు బొంగులొచ్చేమాట నిజమే కానీ, ఈ రోజుల్లో ఆ పాతిక రూపాయలకు రెండు బొంగులు కూడా రావన్నాడు.

"అవునండీ! రావు. ఇదిగో చూడండి! పిడికెడంత లేని ఈ బొంగు నాలుగు రూపాయలు. దీన్ని చీల్చి అల్లితే నాలుగు చేటలన్నా కావు. ఒక్కోచోట రూపాయిన్నర, పావల తక్కువరెండు, చచ్చి చెడి రెండు రూపాయలకు అమ్ముడుపోవడం కనాకష్టం. ఒక్కసారి చేట కొన్నారనుకోండి. రెండేళ్ళ

దాకా అదే పనిచేస్తుంది. ఏమంటారు?'' అన్నాడు తిరుపతయ్య.

ఇంకో లావుపాటి వెదురును చపించాడు. "దీని పేరు పర్వతం బొంగు. ఇది అల్లడానికి పనికారాదు. నిచ్చెన్లు చేస్తాం. ఒక్క బొంగు పదిహేను. ఇరవయ్ దాకా వుంటుంది. రెండు బొంగులూ కలిపి, రెండు పదిహేన్లు ముప్పయ్. మెట్లకోసం, ఇంకా రెండు చిన్న బొంగులు కావాలి. రెండు నాలుగులు ఎనిమిది కలిసి ముప్పయ్ ఎనిమిది. నిచ్చెన ఖరీదు అరవయ్ దాకా చెబుతామనుకోండి, యాభయ్ యాభయ్యయిదు కన్నా పలకదు. అంటే ఖర్చులు పోను 12 నుండి 15 దాకా మిగులుతాయి. మీరైనా రోజూ నిచ్చెన కొంటారా? ఒక్కసారి కొంటే ముప్పయ్యేళ్ళ దాకా వుంటుంది. ఊరు మొత్తం మీద పది నిచ్చెన్లుంటే, ఊరు ఊరంతా వాటితోనే సర్దుకుంటారు. అవునా బాబూ?'' అన్నాడు తిరుపతయ్య.

ఈలావు బొంగులు, పందిళ్ళకూ, పరంజాలకూ, నిచ్చనలకూ తప్ప పనికి రావన్నాడు. ఏవి అల్లినా సన్న బొంగులతోనే అల్లాలన్నాడు.

బొంగులావును బట్టి, పొడుగును బట్టి ఒక్కో బొంగుతో, 4, 5 చేటలు తయారవుతాయన్నాడు. సైజును బట్టి 5, 6, 7 చేటలు అల్లడం పెద్ద కష్టమేమీ కాదన్నాడు.

బొంగులావును బట్టి, పొడుగును బట్టి ఒక్కో బొంగుతో 4, 5 చేటలు తయారవుతాయన్నాడు. సైజును బట్టి 5, 6, 7 బుట్టలు తయారు చేయవచ్చునన్నాడు. 3, 4 దాకా జల్లెడలు కూడా అల్లవచ్చునన్నాడు. ఒక్క మనిషి రోజుకు 5, 6 చేటలు అల్లడం  పెద్ద కష్టమేమీ కాదన్నాడు.

"ఈ బొంగులన్నీ పైనించి వస్తాయండీ. విశాఖపట్నం, రాజమండ్రి, జన్నారం, వరంగల్లు నుంచి అడితీవాళ్ళు తీసుకొస్తారు. సైజువారీగా ఏరి లాట్లు పెడతారు. వంద 40 నుండి 50, 60 దాకా ఉంటాయండీ! ఒక్కసారి గుత్తేదార్లు లారీల మీద తీసుకొచ్చి అమ్ముతారు. అయితే అప్పటికప్పుడు 'కాష్' పడేయాలి. ఉండి కొనుక్కుంటే మంచిది. కానీ వుండాలిగా సార్! అందుకని, నాలుగైదు రూపాయలెక్కువయినా, అడితీల్లోనే మేం తెచ్చుకుంటాం'' అన్నారు తిరుపతయ్య.

"ఈ వృత్తిలోకి- అంటే వెదుళ్ళు తీల్చి బుట్టలు, అల్లిలు, చేటలు, గంపలు, జల్లెడలు, తడికలు అల్లేవృత్తిలోకి ఇతర వృత్తులవాళ్ళు రాలేదన్నమాటగానీ, ఇప్పుడీ పరిశ్రమ కూడా మట్టి గొట్టుకుపోయే రోజులొచ్చా''యన్నాడు తిరపతయ్య.

"ఏం వొచ్చాయంటారేమిటండీ సార్! మీరు తెలిసే అంటున్నారా, గమ్మత్తుకంటున్నారా? ప్లాస్టిక్కులొచ్చాక- ఇప్పుడన్నిటికి అవే గదండీ! ప్లాస్టిక్ బుట్టలు, గంపలు, జల్లెడలు, చేటలు వచ్చాయి. వెదురు బుట్టలు వాడడం నమోషీకింద తయారయింది. అంతవరకూ సరేగదా! ఈ రోజుల్లో అన్నీ సిమెంటు కొంపలే కడుతున్నారాయె. పై తడికల్లించే పని పోయింది కదా! పార్టిషన్‌కు, పూర్వం తడికలుంటేవి. ఇప్పుడు వొంటి ఇంటికి గోడన్నా కడుతున్నారు. ప్లయివుడ్ పలకలన్నా పెడుతున్నారు. ఈ పనీ మా చేతుల్లోంచి పోయినట్టేగదా! ఇన్నీ పోగా పోగా ఇక మాకు మిగిలివచ్చిందేమిటో మీరే చెప్పండి?'' అన్నాడు తిరుపతయ్య చిరాకుపడుతూ. అతన్ని మామూలు మనిషిని చేయడానికి చాలా టైం పట్టింది.

"మా వృత్తిని మేం తిట్టుకోకూడదు గాని సార్ - ఇంత ముదనష్టపు పని ఇంకోటేదన్న ఉంటే

చూపించండి... సామాన్లు కూడా పెద్దగా అవసరం లేదండీ! వో కత్తి, ఇదిగో - ఈ అమ్ము, ఈ ఒంకెదబ్బనం - చాలు ఈ కత్తితో ఎంత సన్నగానయినా బద్దను చీల్చవచ్చు... మీ వల్ల కాదులెండి. ప్రాక్టీస్ కావాలి. కాగితమంతా పల్చగా చీల్చాలంటే- వెదురు మంచిది కావాలి చూడండి!'' అంటూ ఓ వెదురును పల్చగా చీల్చి చూపించాడు తిరుపతయ్య.

ద్రాక్షకాయల సీజనప్పుడు కాస్త పని యెద్దడిగా ఉంటుందన్నాడు. కమీషనుదారల్చొచ్చి వెయ్యి, రెండువేలు, మూడువేల బుట్టలకు ఆర్డరిచ్చి పోతారట. ఒకో బుట్ట రూపాయిపావలా, రూపాయిన్నర చొప్పున అల్లిస్తారట. వాళ్ళేమో, గిరాకీని బట్టి రెండు, రెండున్నరకు అమ్ముకుంటారట.

''అన్ని ఖర్చులూ పోను బుట్టకు పావలా, ముప్పయ్ పైసలూ ఉంటాయి. కమిషన్‌దారుకు ముప్పావలా నుండి రూపాయిదాకా మిగులుతుంది. లాభమేనండీ! అంత పెట్టుబడి నా దగ్గరలేదు. వడ్డీకి తెస్తే గిట్టదు. బ్యాంకులేమో, నన్ను నమ్మి నాకు మదుపు పెట్టవు. అందుకే నా పిల్లలకు చదువు చెప్పిస్తున్నా. ఈ పనిలో పెట్టుకుండా, వాళ్ళన్నా ఉద్యోగాల్లో చేరితే, వాళ్ళతోనన్నా ఈ వృత్తి మా వంశంలో ఆఖరవుతుంది'' అన్నాడు తిరుపతయ్య.

ఉద్యోగాలు అంత సులభంగా దొరకవనీ, చదువుకున్న చాలా మంది ఉద్యోగాల్లేక, ఈ పుణ్యభూమిలో ఆత్మహత్యలుచేసుకుంటున్నారని తిరుపతయ్యకు తెలీదు పాపం!